క్లుప్తంగా

ఇష్టంగా పనిచేయండి



కారుణ్య నియామక పత్రాన్ని అందజేస్తున్న మేయర్ బీవై రామయ్య

కర్నూలు (టౌన్) : కష్టపడి కాకుండా ఇష్టపడి పనిచేయాలని నగర మేయర్ బీవై.రామయ్య వెల్లడించారు. నగరపాలక ప్రజారోగ్య విభాగంలో 4వ డివిజన్‌లో మేస్త్రీగా పనిచేసే ఎం.సీ.నాగరాజు విధుల్లో ఉంటూ అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన స్థానంలో భార్య మల్లీశ్వరీకి ఇదే విభాగంలో అటెండర్ ఉద్యోగం కల్పించారు. శుక్రవారం ఇందుకు సంబంధించిన నియామక పత్రాన్ని మేయర్ ఆమెకు అందజేశారు. కార్యక్రమంలో మేనేజర్ చిన్నరాముడు, శానిటరీ సూపర్ వైజర్ నాగరాజు, సీనియర్ అసిస్టెంట్ రామక్రిష్ణ, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ శ్రీకాంత్, ఇశ్రాయేలు పాల్గొన్నారు.

బయోవేస్ట్‌ను పకడ్బందీగా వేరు చేయాలి

కర్నూలు(హాస్పిటల్): ఆసుపత్రిలో వెలువడే బయోవేస్ట్‌ను పకడ్బందీగా వేరు చేయాలని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ జి. నరేంద్రనాథ్‌రెడ్డి సూచించారు. శుక్రవారం ఆసుపత్రిలోని ధన్వంతరి హాలులో హెడ్‌నర్సులతో బయోవేస్ట్ విధానంపై ఆయన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆసుపత్రిలోని చెత్తను మూడు రకాలుగా వేరు చేయాలని, అందులో బయోవేస్ట్ కూడా ఒకటన్నారు. దీనిని ప్రత్యేకమైన డబ్బాలలో వేయాలని సూచించారు. అయితే కొంతమంది బయోవేస్ట్‌ను సాధారణ చెత్తలో కలుపుతున్నారని, దీనివల్ల పర్యావరణం దెబ్బతింటుందని, ప్రజల ప్రాణాలకు ముప్పు ఏర్పడుతుందన్నారు. సమావేశంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి, సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ బి. వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు జిల్లాకు వ్యవసాయ శాఖ కమిషనరేట్ బృందం రాక

కర్నూలు(అగ్రికల్చర్): వ్యవసాయశాఖ గుంటూరులోని కమిషనరేట్ నుంచి నలుగురు అధికారుల బృందం శనివారం కర్నూలుకు రానుంది. వైఎస్సార్ రైతుభరోసా 5వ ఏడాదికి సంబంధించి మొదటి విడత పెట్టుబడి సాయం విడుదల చేసే రాష్ట్ర స్థాయి కార్యక్రమం పత్తికొండ వేదికగా జరుగుతోంది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి రైతుల బ్యాంకు ఖాతాలకు పెట్టుబడి సాయాన్ని విడుదల చేయనున్నారు. ఈ నేపథ్యంలో వ్యవసాయ శాఖ కమిషనర్ జిల్లాలో ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు ప్రత్యేక టీమ్‌ను పంపుతున్నారు. ఈ బృందం శనివారం జిల్లాకు చేరుకోనున్న ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించనుంది. సీఎం పర్యటన ముగిసే వరకు జిల్లాలోనే ఉండే అవకాశం ఉంది. టీమ్‌లో జేడీఏ శ్రీధర్, డీడీఏలు బాలునాయక్, ఏవో జయకృష్ణ ఉన్నారు.

రేపు ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాలు

కర్నూలు కల్చరల్: టీజీవీ కళాక్షేత్రంలో ఈనెల 28న సాయంత్రం 6.30 గంటలకు ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు కళాక్షేత్రం కార్యదర్శి మహమ్మద్‌మియ్య తెలిపారు. కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య రచించిన తెలుగు భోజుడు (తృతీయ ముద్రణ) గ్రంథావిష్కరణ, అలనాటి ఎన్టీఆర్ పాటలకు నాట్యాచార్య కరీముల్లా శిష్య బృందంచే నృత్య నీరాజనం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సాహితీ ప్రియులు, కళాభిమానులు అందరూ పాల్గొన వచ్చని విజ్ఞప్తి చేశారు.

అనారోగ్యంతో డాక్టర్ రవీంద్రారెడ్డి మృతి

కర్నూలు(హాస్పిటల్): జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో డిస్ట్రిక్ట్ న్యూక్లియస్ మెడికల్ ఆఫీసర్‌గా పనిచేసిన డాక్టర్ కవలకుంట్ల రవీంద్రారెడ్డి అనారోగ్యంతో మృతి చెందారు. గత కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ కారణంగానే వీఆర్ఎస్ తీసుకుని ఉద్యోగం మానుకున్నారు. గురువారం వైఎస్ఆర్ జిల్లాలో తీవ్ర అస్వస్థతకు గురై మరణించారు. శుక్రవారం ఆయన మృతదేహానికి వైఎస్ఆర్ జిల్లా దువ్వూరు మండలం బుక్కాయపల్లె గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఆయన కొంత కాలం పాటు ఆదోని టీబీ సెంటర్‌లో మెడికల్ ఆఫీసర్‌గా కూడా విధులు నిర్వర్తించారు. అనంతరం వైఎస్ఆర్, చిత్తూరు జిల్లాల్లో పనిచేశారు.

సాక్షి సినిమాలు

ఎస్‌వీసీ కాంప్లెక్స్ : బిచ్చగాడు 2, మళ్లీ పెళ్లి, మేమ్ ఫేమస్, మెంటూ, ది లిటిల్ మర్మయిడ్ , ఫాస్ట్ ఎక్స్, 2018, ది కేరళ స్టోరీ
వి మెగా ఆనంద్ సినీ కాంప్లెక్ : బిచ్చగాడు 2, మేమ్ ఫేమస్ , మెంటూ, 2018, విరుపాక్ష,ఏలియన్స్ 2042, అన్నీ మంచి శకునములే
వెంకటేష్ సినీ కాంప్లెక్స్ : బిచ్చగాడు 2, విరుపాక్ష
ఐనాక్స్ : ఫాస్ట్ ఎక్స్, మేమ్ ఫేమస్ , మళ్లీ పెళ్లి, మెంటూ, 2018, ది కేరళ స్టోరీ, గ్రే : ది స్పై హూ లవ్డ్ మీ
భరత్ కాంప్లెక్స్ : ఫాస్ట్ ఎక్స్, కస్టడీ, ది కేరళ స్టోరీ
శ్రీరామ : సింహాద్రి
రాజ్ : మళ్లీ పెళ్లి
విజయ : బిచ్చగాడు 2

విజ్ఞాన వీచికలు

- గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన ప్రత్యేక శిబిరాలు
- వైజ్ఞానిక, సాంస్కృతిక, సృజనాత్మక కళారంగాలపై ప్రత్యేక శిక్షణ
- ఉత్సాహంగా పాల్గొంటూ సద్వినియోగం చేసుకుంటున్న విద్యార్థులు

కర్నూలు కల్చరల్: గ్రంథాలయాలను ప్రభుత్వం విజ్ఞాన కేంద్రాలుగా తీర్చిదిద్దుతోంది. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సూచనతో రాష్ట్ర పౌర గ్రంథాలయ శాఖ సమ్మర్ క్యాంప్ పేరుతో వేసవి సెలవుల్లో విద్యార్థులు పలు అంశాలపై అవగాహన పెంపొందించుకునేందుకు లైబ్రరీల్లో ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసింది. వివిధ పోటీలను నిర్వహిస్తూ పిల్లల మానసికోల్లాసానికి తోడ్పాటునందిస్తోంది. ఆట వస్తువులు... కథల పుస్తకాలను అందిస్తూ ప్రోత్సహిస్తోంది.

జూన్ 11 వరకు శిబిరాలు

ఉమ్మడి కర్నూలు జిల్లాలోని అన్ని శాఖా గ్రంథాలయాల్లో ఈనెల 8 నుంచి ప్రారంభమైన వేసవి విజ్ఞాన శిబిరాలు జూన్ 11 వరకు కొనసాగనున్నాయి. 10 నుంచి 15 ఏళ్ల లోపు బాలబాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా అధికారులు కార్యాచరణ అమలు చేస్తున్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహిస్తున్నారు. ప్రతి గ్రంథాలయానికి సమీప ప్రాంతంలోని విద్యార్థులను వచ్చేలా చర్యలు తీసుకున్నారు. నిత్యం వివిధ కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నారు. ముఖ్యంగా పిల్లలకు విజ్ఞానం పెంపొందించేలా, మానసిక వికాసానికి సంబంధించిన ఆటపాటలు తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఒక్కో గ్రంథాలయంలో కనీసం 30 మంది నుంచి 60 మంది విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు. అందుకు అనుగుణంగా ప్రతి గ్రంథాలయంలో ఒక క్వాలిఫైడ్ టీచర్‌ను నియమించారు. ప్రజాప్రతినిధులు, విశ్రాంత ఉద్యోగులను పిలిపించి వారి అనుభవాలను పిల్లలకు వివరించేలా చర్యలు చేపట్టారు. రచయితలు, డ్రాయింగ్ మాస్టర్లు, క్రాఫ్ట్ టీచర్లు, ఇలా పలు రంగాలకు చెందిన వారితో శిక్షణ ఇప్పిస్తున్నారు. ఈ క్రమంలోనే శిబిరంలో పాల్గొనే విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు బహూకరిస్తున్నారు.

సృజనాత్మక పెంపొందేలా..

జిల్లాలోని గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్‌లో సృజనాత్మకత పెంపొందేలా తర్ఫీదు ఇస్తున్నారు. ముఖ్యంగా కథలు చెప్పడం, పుస్తక పఠనం, చిత్రలేఖనం, పేపర్ ఆర్ట్, థియేటర్ ఆర్ట్ వంటి సృజనాత్మక ప్రక్రి యలను నిర్వహిస్తున్నారు. దీంతో విద్యార్థులు సమ్మర్ క్యాంప్‌ల్లో ఉత్సాహంగా పాల్గొంటున్నారు.

సమ్మర్‌క్యాంప్ టైం టేబుల్

- ఉదయం 8 నుంచి 8:30 వరకు కథలు చెప్పించడం
- 8:30 నుంచి 9 వరకు పుస్తక పఠనం
- 9 నుంచి 9:30 వరకు డ్రాయింగ్
- 9:30 నుంచి 10 వరకు స్పోకెన్ ఇంగ్లిష్
- 10 నుంచి 10:30 వరకు విరామం
- 10:30 నుంచి 11 వరకు కథలు చెప్పడం
- 11 నుంచి 11:30 వరకు అతిథులతో స్ఫూర్తిదాయక ప్రసంగాలు
- 11:30 నుంచి 12 గంటల వరకు నృత్యాలు, నాటికలు, బొమ్మల తయారీ, ఆటలు



కర్నూలు శిబిరంలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

విద్యార్థుల ప్రతిభను వెలికి తీసేందుకే



విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు, ముందు చూపుతోనే వేసవి సెలవుల్లో విద్యార్థులకు శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నాం. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని గ్రంథాలయ శాఖల్లో తరగతులు కొనసాగుతున్నాయి. ప్రత్యేక నిపుణులు శిక్షణ తరగతులు తీసుకుంటున్నారు.
– మద్దూరు సుభాష్ చంద్రబోస్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్

షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలు



ఉమ్మడి జిల్లాలోని అన్ని గ్రంథాలయాల్లో విధిగా సమ్మర్ క్యాంప్‌లు జరుగుతున్నాయి. షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలు జరిపిస్తున్నాం. పెద్ద సంఖ్యలో క్యాంప్‌కు వచ్చేలా విస్తృతంగా ప్రచారం చేయించడంతో విద్యార్థులు భారీగా హాజరు అవుతున్నారు.పిల్లలు తమ ప్రజ్ఞా పాటవాలను పెంపొందించుకునేందుకు ఈ శిబిరాలు ఉపయోగపడతాయి. అన్ని విభాగాల్లో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందిస్తున్నాం. – కె. ప్రకాష్,జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి

కొత్త విషయాలు నేర్చుకుంటున్నాం



రాష్ట్ర ప్రభుత్వం గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన వేసవి విజ్ఞాన శిబిరం వల్ల ఎంతో మేలు కలుగుతోంది. ఆడుతూ పాడుతూ కథలు వింటున్నాం. పుస్తకాలు చదువుతున్నాం. డ్రాయింగ్, పేపర్ ఆర్ట్ నేర్పిస్తున్నారు. సమ్మర్ క్యాంప్ ద్వారా కొత్త విషయాలు నేర్చుకో గలుగుతున్నాం.
– పూజిత, 6వ తరగతి, కర్నూలు

ఎంజాయ్ చేస్తూ



వేసవి విజ్ఞాన శిబిరంతో ఎంజాయ్ చేస్తూ కొత్త కొత్త అంశాల్లో శిక్షణ పొందుతున్నాం. జాతీయ నాయకుల జీవిత చరిత్రలను కథల రూపంలో చెప్పడం, పుస్తక పఠనం, పుస్తక సమీక్ష, స్పోకెన్ ఇంగ్లిష్‌లో తర్ఫీదు పొందుతున్నాం. యోగా సాధన, ఆటల పాటలతో ఆనందంగా గడుపుతున్నాం. – వీరేష్, 7వ తరగతి, కర్నూలు

బడుగు,బలహీన వర్గాల ఆశాజ్యోతి సీఎం వైఎస్ జగన్

కర్నూలు(సెంట్రల్) : బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతి సీఎం వైఎస్‌జగన్ మోహన్‌రెడ్డి అని, అమరావతిలో ఒకేసారి 53 వేల మంది పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వడం హర్షణీయమని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్ మాజీ సభ్యుడు సత్తి రాజశేఖర్ అన్నారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అమరావతిలో పేదలు ఉండకూడదని, పేదలు ఉంటే సామాజిక అసమానతలు వస్తాయని చెప్పిన చంద్రబాబుకు వచ్చే ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు. దళితులు, గిరిజనులు ఆయనకు కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే కావాలని, వారికి పదవులు, ఆస్తులు అవసరం లేదన్నట్లు చంద్రబాబు వ్యవహరించడం ఘోరమన్నారు. పేదల కోసం తరిపించిపాలన చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

ఎరువుల్లో రసాయనాలు తగ్గించండి



సమావేశంలో పాల్గొన్న కర్నూలు ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్

కర్నూలు(రాజ్‌విహార్): ఎరువుల్లో రైతులు, ఇతర జీవాలకు హాని కలిగించే రసాయనాల శాతం తగ్గించాలని కర్నూలు ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్ కోరారు. శుక్రవారం హైదరాబాదులో జరిగిన స్టాండింగ్ కమిటీ ఆన్ కెమికల్స్, ఫర్టిలైజర్స్ సమావేశంలో ఆయన పాల్గొని పలు అంశాలపై చర్చించడంతో పాటు పలు సూచనలు చేశారు.

పతకాలు సాధించి ఆర్‌యూ ఖ్యాతిని పెంచండి



క్రీడాకారులను అభినందిస్తున్న వీసీ ఆనందరావు

కర్నూలు (రూరల్) : ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో మే 29 నుంచి జూన్ 2 వరకు జరిగే ఖేలో ఇండియా అంతర్ విశ్వవిద్యాలయాల పోటీల్లో పతకాలు సాధించి రాయలసీమ యూనివర్సిటీ ఖ్యాతిని పెంచాలని ఉపకులపతి ఆచార్య ఆనందరావు అన్నారు. శుక్రవారం యూనివర్సిటీలో పోటీలో పాల్గొనేందుకు వెళ్తున్న పురుషుల వెయిట్ లిఫ్టింగ్, మహిళల బ్యాడ్మింటన్ జట్టులను అభినందించారు. మహిళల బ్యాడ్మింటన్‌లో ప్రణవి, జాహ్నవి, ఆకాంక్ష, లహరి, ఆఫ్రీన్, పురుషుల వెయిట్ లిఫ్టింగ్‌లో అబ్దుల్లా, కోచ్‌లు హేమంత్‌రెడ్డి, యూసుఫ్ బాషా ఉన్నారు. యూనివర్సిటీ స్పోర్ట్స్ కో–ఆర్డినేటర్ డాక్టర్ కె.వి.శివకిషోర్, రిజిస్ట్రార్ సుందరానంద పాల్గొన్నారు.

పోటీ పరీక్షలకు సంసిద్ధమవ్వాలి

కర్నూలు (న్యూసిటీ) : విద్యార్థులు పోటీ పరీక్షలకు సిద్ధం కావాలని రాయలసీమ యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ ఆచార్య ఎ.ఆనందరావు సూచించారు. శుక్రవారం స్థానిక రాయలసీమ యూనివర్సిటీలో పరిపాలన భవనంలో బ్యాంకింగ్, పోటీ పరీక్షలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. వీసీ మాట్లాడుతూ విద్యార్థులు ప్రతిరోజూ తమ కోర్సుకు సంబంధించిన అంశాలతోపాటు పోటీ తత్వాన్ని అలవర్చుకోవాలన్నారు. నంద్యాల గురు రాఘవేంద్ర బ్యాంకింగ్ కోచింగ్ సెంటర్ నిర్వాహకులు పి.దస్తగిరి రెడ్డి, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ భరత్‌కుమార్ పాల్గొన్నారు.

పార్లమెంటు భవనాన్ని ప్రారంభించే అర్హత రాష్ట్రపతికి లేదా?

కర్నూలు(రూరల్): దేశ రాజధానిలో నిర్మించిన నూతన పార్లమెంటు భవనం ప్రారంభించే అర్హత రాష్ట్రపతికి లేదా అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రశ్నించారు. శుక్రవారం నగరంలో సీపీఐ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగాధినేత అయిన రాష్ట్రపతిచే పార్లమెంటు భవనాన్ని ప్రారంభించి ఆ పదవి గౌరవాన్ని కాపాడాలని కోరారు. పార్లమెంటు ప్రారంభోత్సవాన్ని 21 పార్టీలు బహిష్కరించాయని, కొంతమంది సుప్రీం కోర్టులో పిటిషన్ వేశారన్నారు. కేంద్ర ప్రభుత్వం సీబీఐ, ఈడీ, ఐటీ శాఖలను నిర్వీర్యం చేసిందని దుయ్యబట్టారు.

ఇంటర్ పరీక్షల్లో 12 మంది డిబార్

కర్నూలు సిటీ: ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షల్లో 12 మంది విద్యార్థులు డిబార్ అయ్యారు. ఉదయం జరిగిన ఫస్ట్ ఇయర్ పరీక్షలకు 14,680 మంది విద్యార్థులకు గాను 13,857 మంది హాజరై, 823 మంది గైర్హాజరయ్యారు. కోసిగి ప్రభుత్వ జూనియర్ కాలేజీలో 8 మంది మాల్ ప్రాక్టిస్ కింద కేసులు నమోదు చేసి డిబార్ చేశారు. మధ్యాహ్నం జరిగిన సెకెండ్ ఇయర్ పరీక్షలకు 6,982 మంది విద్యార్థులకు గాను 6487 మంది హాజరుకాగా 495 మంది గైర్హాజరయ్యారు. ఆదోనిలోని సాయి జూనియ ర్ కాలేజీలో నలుగురు విద్యార్థులను డిబార్ చేశారు.

పులకుర్తి వాసికి డాక్టరేట్



కె.మౌలాలీ బాషా

కర్నూలు సిటీ: నగరంలోని ఓ బీఈడీ కాలేజీలో పని చేస్తున్న పులకుర్తి వాసి కె.మౌలాలి బాషాకు ఫిలాసఫీలో డాక్టరేట్ వచ్చింది. మేఘాలయ రాష్ట్రంలోని జోరాబాత్‌లో ఉన్న సీఎంజే యూనివర్సిటీలో ఫిలాసఫీ విభాగంలో ఆచార్య డా.విజయకుమార్ చౌహన్ పర్యవేక్షణలో సైకలాజికల్ ఇంపాక్ట్ ఆఫ్ సోషల్ మీడియా ఆన్ హైస్కూల్ స్టూడెంట్స్ ఆఫ్ కర్నూలు డిస్ట్రిక్ అనే అంశంపై పరిశోధనలు చేశారు. ఈ మేరకు ఈ నెల 23వ తేదిన ఆ వర్సిటీ డాక్టరేట్‌ను ప్రకటించినట్లు తెలిపారు.

నేడు హజ్ యాత్రికులకు వ్యాక్సినేషన్

కర్నూలు (హాస్పిటల్) : హజ్‌కు ప్రైవేటు ఏజెన్సీ ద్వారా వెళ్లే యాత్రికులకు ఈనెల 27న కర్నూలు నగరంలోని బండిమెట్టలో ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్‌లో వ్యాక్సిన్ వేయనున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ రామగిడ్డయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు వ్యాక్సినేషన్ శిబిరం కొనసాగుతుందన్నారు. యాత్రికులకు ఆరోగ్య పరీక్ష నిర్వహించి అవసరమైన టీకాలను వేసి సర్టిఫికెట్ ఇస్తామన్నారు.

హ్యాండ్‌బాల్, వాలీబాల్ క్రీడలను ఆదరించాలి

కర్నూలు(రూరల్) : హ్యాండ్‌బాల్, వాలీబాల్ క్రీడలను ఆదరించాలని టీజీ భరత్ అన్నారు. శుక్రవారం నగరంలోని గనిగల్లీలో హ్యాండ్, వాలీబాల్ సీజన్– 4 టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ క్రీడల అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తానని తెలిపారు. యువత ఏదో ఒక క్రీడలో భాగస్వామి కావాలని సూచించారు. కార్యక్రమంలో ఇమ్రాన్, కలాం, జహంగీర్, ముక్తార్ పాల్గొన్నారు.

నేడు వాలీబాల్ సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం

కర్నూలు (రూరల్) : నగరంలో గుత్తి రోడ్డులోని మిస్టర్ ఇడ్లీ వద్ద శనివారం ఉదయం 10 గంటలకు జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహిస్తున్నట్లు సంఘం కార్యదర్శి షరీఫ్ అహ్మద్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా కమిటీ సభ్యులందరూ హాజరుకావాలని కోరారు.

కర్నూలు చేరిన 'మరో గ్రంథాలయ ఉద్యమ యాత్ర'

కర్నూలు కల్చరల్: గ్రంథాలయాల ఆవశ్యకత పుస్తక ప్రియులను పెంచేందుకు రాష్ట్ర వ్యాప్తంగా మరో గ్రంథాలయ ఉద్యమం పేరుతో రచయిత మంచికంటి వెంకటేశ్వరరెడ్డి చేపట్టిన మోటార్ సైకిల్ యాత్ర శుక్రవారం కర్నూలుకు చేరుకుంది. సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో ఆయన రచయితలో సమావేశమయ్యారు. పత్తి ఓబులయ్య, అజీజ్, వెంకటకృష్ణ పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు బానిసలు కావొద్దు



మాట్లాడుతున్న రాయపాటి శ్రీనివాస్

కర్నూలు కల్చరల్: పొగాకు ఉత్పత్తులకు, చెడు వ్యసనాలకు బానిసలు కాకూడదని లయన్స్ గవర్నర్స్ ప్రతినిధి లయన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ అన్నారు. ఈనెల 31న ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్ ఆధ్వర్యంలో శుక్రవారం వీఆర్‌కాలనీలోని నైస్ కంప్యూటర్స్ కార్యాలయంలో పొగాకు సేవించడం వల్ల కలిగే అనర్థాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్ అధ్యక్షురాలు రాయపాటి నాగలక్ష్మి, కార్యదర్శి గోవర్ధన గిరి, కేవిన్నార్ పాఠశాల కరస్పాండెంట్ గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

రుణాల విషయంలో బ్యాంకర్లు శ్రద్ధ వహించాలి

- జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన



కర్నూలు జిల్లా క్రెడిట్ ప్లాన్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్

కర్నూలు (అర్బన్) : వ్యవసాయం, ఎంఎస్ఎంఈలకు సంబంధించిన లోన్లు ఇచ్చే విషయంలో బ్యాంకర్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన సూచించారు. శుక్రవారం జిల్లాపరిషత్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లాస్థాయి బ్యాంకర్స్ కన్సల్టేటివ్ కమిటీ (డీసీసీ) సమావేశాన్ని నిర్వహించారు. కాగా సమావేశానికి కొందరు బ్యాంక్ కో–ఆర్డినేటర్లు హాజరు కాకపోవడంతో కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. సమావేశానికి హాజరుకాని కో–ఆర్డినేటర్ల పేర్లు, బ్యాంకు పేరుతో సహా వారి హెడ్ ఆఫ్ ది బ్యాంక్ దృష్టికి తీసుకువెళ్లేలా చర్యలు తీసుకోవాలని ఎల్‌డీఎంని ఆదేశించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. వ్యవసాయానికి సంబంధించి లోన్లు ఇచ్చే విషయంలో ప్రభుత్వ బ్యాంకుల కంటే ప్రైవేటు బ్యాంకులు ఎక్కువ బాధ్యతతో వ్యవహరిస్తున్నాయన్నారు. ముఖ్యంగా పంజాబ్ నేషనల్ బ్యాంక్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అందరి కన్నా చాలా తక్కువ శాతం ఇస్తున్నారని, ఈ విషయంలో ప్రభుత్వ బ్యాంకులు పురోగతి సాధించాలన్నారు. ఎంఎస్ఎంఈకి సంబంధించి ఇచ్చిన లక్ష్యాన్ని మించి సాధించామని చెబుతున్నారే కానీ అందులో ఎంతమంది పాత ఎంఎస్ఎంఈలకే లోన్లు ఇచ్చారని, ఎంతమంది కొత్త వారికి సపోర్ట్ చేస్తూ ఎంఎస్ఎంఈలు ఏర్పాటు చేయించారనే నివేదికలు గతేడాది నుంచి ఇప్పటివరకు ఇవ్వాలని ఎల్‌డీఎంని ఆదేశించారు. అనంతరం కర్నూలు జిల్లా క్రెడిట్ ప్లాన్ 2023–24కి సంబంధించిన పుస్తకాన్ని జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. సమావేశంలో నగరపాలక కమిషనర్ భార్గవతేజ, ఎల్‌డీఎం రామచంద్రరావు, ఆర్‌బీఐ లీడ్ డిస్ట్రిక్ట్ ఆఫీసర్ రెహ్మాన్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించాలి

జిల్లాలో ఇంకా ప్రారంభం కాని ఇళ్ల నిర్మాణాల పనులు జూన్ 10వ తేదీ నాటికి మొదలుపెట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం స్థానిక జిల్లాపరిషత్ మినీ సమావేశ భవనంలో హౌసింగ్ అధికారులు, కాంట్రాక్టర్లతో ఆమె సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆప్షన్–3 కింద ఉన్న ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

సీఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయండి

కర్నూలు(సెంట్రల్): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 30వ తేదీ పత్తికొండకు రానున్న నేపథ్యంలో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. శాఖల వారీగా తీసుకోవాల్సిన చర్యలు, ఏర్పాట్లపై ఆమె శుక్రవారం టెలీ కాన్ఫరెన్స్‌లో అధికారులతో సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ.. సీఎం సభకు కర్నూలు, ఆదోని ప్రాంతాల నుంచి బస్సుల్లో వచ్చే వారు ఎక్కువ దూరం నడవకుండా సమీపంలోనే పార్కింగ్ ప్రదేశాలను ఏర్పాటు చేయాలని, పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని జిల్లా ఎస్పీ కృష్ణకాంత్, జేసీ ఎస్.మౌర్యలను ఆదేశించారు. కాన్ఫరెన్స్‌లో జేసీ మౌర్య, డీపీఓ నాగరాజునాయుడు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు వ్యవసాయ పనిముట్ల పంపిణీ

కర్నూలు(అగ్రికల్చర్): పీఎంకేఎస్‌వై 2.0 వాటర్‌షెడ్‌లో భాగంగా వ్యవసాయ ఉత్పాదకత పెంపే లక్ష్యంగా రూ.4.92 కోట్లతో వ్యవసాయ యాంత్రీకరణ, ఆధునిక పనిముట్లు పంపిణీ చేసేందుకు రంగం సిద్ధం అయింది. శుక్రవారం ఎమ్మిగనూరు మండలం కందనాతి గ్రామంలో ఆధునిక వ్యవసాయ పనిముట్లు పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ సృజన ప్రారంభించారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో యువతికి గాయాలు

కర్నూలు : కర్నూలు శివారులోని పంచలింగాల చెక్‌పోస్టు వద్ద 44వ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మామిదాలపాడు గ్రామానికి చెందిన ఎస్తేరు (16) తీవ్ర గాయాలకు గురై అపస్మారక స్థితిలో ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. గురువారం రాత్రి పుల్లూరు వైపు నుంచి కర్నూలుకు వైపు రావడానికి హైవే దాటుతుండగా హైదరాబాదు వైపు వెళ్తున్న కారు వేగంగా ఢీకొట్టి వెళ్లింది. రోడ్డుకు ఇవతలివైపు ఉన్న సమీప బంధువు వెంటనే ఎస్తేరును ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం యువతి కోమాలో ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. బాధితురాలి మామ లక్ష్మన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కర్నూలు అర్బన్ తాలూకా ఎస్ఐ నరసింహులు తెలిపారు.

ఉల్లంఘనులకు జరిమానా

కర్నూలు : ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారికి ట్రాఫిక్ పోలీసులు రూ.65,120 జరిమానా విధించారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ట్రాఫిక్ డీఎస్పీ నాగభూషణం ఆధ్వర్యంలో నగరంలోని ముఖ్య ప్రదేశాల్లో మైనర్ డ్రైవింగ్‌పై శుక్రవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. 32 మంది మైనర్లను అదుపులోకి తీసుకుని కొత్తపేటలోని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు తరలించి, వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు.

మొక్కలు పెంచండి

కర్నూలు(సెంట్రల్) : మొక్కలు పెంచి పర్యావరణాన్ని కాపాడాలని ఫారెస్టు బీట్ ఆఫీసర్లు రేణుక, అబ్దుల్ కలాం కోరారు. శుక్రవారం రిజిస్ట్రేషన్ కార్యాలయ ఆవరణలో మొక్కల పెంపకంపై డాక్యుమెంట్ రైటర్లకు అవగాహన కల్పించారు. ఏబీఓలు కాళిదాసు. లక్ష్మీదేవిబాయ్, డాక్యుమెంట్ రైటర్లు చంద్రశేఖర్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ

కర్నూలు కల్చరల్: స్థానిక సూర్యనారాయణ స్వామి ఆలయం గురుదత్త పీఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ గణపతి సచ్చిదానంద స్వామి జన్మదిన వేడుకల్లో భాగంగా శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దాతల సహకారంతో ఆలయం వద్ద పులిహోర, మజ్జిగ పంపిణీ చేశారు. శివరామకృష్ణ, డాక్టర్ సి. ఆంజనేయులు, డాక్టర్ సీపీ నగేష్ శర్మ, డాక్టర్ కృష్ణమోహన్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాలు లేని నగరంగా తీర్చిదిద్దుదాం



వాహనాన్ని ప్రారంభిస్తున్న కమిషనర్

కర్నూలు (టౌన్) : కర్నూలును వ్యర్థాలు లేని నగరంగా తీర్చిదిద్దుదామని నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక నగరపాలక కార్యాలయంలో ఆర్ ఆర్ ఆర్ (రెడ్యూస్, రీసైకిల్, రీయూస్) పేరుతో వ్యర్థాల సేకరణ కోసం ప్రత్యేకంగా వాహనాన్ని కమిషనర్ జెండా ఊపి ప్రారంభించారు. కమిషనర్ మాట్లాడుతూ ఇప్పటికే వ్యర్థాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. ఎక్కడ పడితే అక్కడ వ్యర్థాలు, పాత వస్తువులు, పాత పుస్తకాలు, ప్లాస్టిక్ సీసాలు, నిరుపయోగంగా ఉన్న దుస్తులు వంటి వాటిని పారవేడకుండా సేకరిస్తున్నట్లు చెప్పారు. నగరపాలక సంస్థ పరిధిలోని 52 వార్డులతో పాటు ఆయా డివిజన్ కేంద్రాల వద్ద వ్యర్థాల సేకరణకు డబ్బాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలు స్వచ్ఛందంగా ఇంట్లోని వ్యర్థాలను ఆయా డబ్బాల్లో వేయాలని కోరారు. కార్యక్రమంలో నగరపాలక అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్, నగరపాలక డిప్యూటీ కమిషనర్ ఎస్.వి. రమాదేవి, మున్సిపల్ ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, సూపరింటెండెంట్ క్రిస్టఫర్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ ఇన్నోవేషన్‌లో బృందావన్ విద్యార్థుల ప్రతిభ



అవార్డు అందుకుంటున్న విద్యార్థులు

కర్నూలు (టౌన్) : స్వచ్ఛ ఇన్నోవేషన్ చాలెంజ్ పేరుతో నిర్వహించిన పోటీల్లో పెద్దటేకూరు వద్ద ఉన్న బృందావన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి చెందిన మూడవ సంవత్సరం విద్యార్థులు వై.మేఘన, డి. కావేరి, చాంద్‌బాషాలు ప్రతిభ చాటారు. స్వచ్ఛతలో సులభమైన విదానాన్ని అమలు చేయవచ్చంటూ చేసిన ప్రయోగానికి ఉత్తమ బహుమతి లభించింది. దీంతో శుక్రవారం సాయంత్రం స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో మేయర్ బీవై. రామయ్య, నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజలు విద్యార్థులకు రూ.30 వేలు ప్రోత్సాహక నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో నగరపాలక ఆడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్, బిట్స్ కళాశాల ప్రిన్సిపాల్ పి.గిరిష్‌రెడ్డి పాల్గొన్నారు.

ఈఎస్ఐని బలోపేతం చేయాలి

కర్నూలు(సెంట్రల్) : దేశవ్యాప్తంగా ఈఎస్ఐ పథకాన్ని బలోపేతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ డిమాండ్ చేశారు. కర్నూలు ఈఎస్ఐ ఆసుపత్రిని కేంద్ర ప్రభుత్వ అజమాయిషీకి పంపొద్దని కోరారు. శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అబ్దుల్‌దేశాయ్, సాయిబాబా, విజయ్ పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించాలి



పోటీలను ప్రారంభిస్తున్న సీఈఓ పి.వి.రమణ

కర్నూలు(రూరల్) : విద్యార్థులు తమకిష్టమైన క్రీడల్లో సాధన చేసి జాతీయస్థాయిలో రాణించాలని జిల్లా క్రీడా శాఖ సీఈఓ పి.వి.రమణ అన్నారు. శుక్రవారం నగరంలోని ఔట్ డోర్ స్టేడియంలో ఫుట్‌బాల్ జిల్లా అధ్యక్షుడు ముప్పా రాజశేఖర్ ఆధ్వర్యంలో నగరస్థాయి ఫుట్‌బాల్ పోటీలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రీడలు ఆడటం ద్వారా గుర్తింపు వస్తుందన్నారు. క్రీడారంగాన్ని సేవలందిస్తున్న న్యాయవాది శ్రీధర్, రామలింగప్పను అభినందించారు. కార్యక్రమంలో పెద్దపాడు స్కూల్ హెచ్ఎం వేణుగోపాల్, స్పాన్సర్ రామలింగప్ప, జిల్లా ఒలింపిక్ సంఘం సంయుక్త కార్యదర్శి అవినాష్ శెట్టి, కార్యదర్శి బ్రహ్మకుమార్ తదితరులు పాల్గొన్నారు.